## దటీజ్ తెలంగాణ

దేశ జనాభాలో 2.9 శాతం వాటా మాత్రమే కలిగి ఉన్న తెలంగాణ.. దేశ జీడీపీలో 4.9 శాతం వాటాను కలిగి ఉన్నది. 2013-14లో తెలంగాణ జీఎస్డీపీ రూ. 4.51 లక్షల కోట్లుగా ఉంటే, 2022-23 నాటికి రూ. 13.27 లక్షల కోట్లకు చేరింది. ఒక్క ఏడాదిలో తెలంగాణ నమోదుచేసే జీఎస్డీపీతో మన పొరుగున ఉన్న భూటాన్‌ను 52 ఏండ్లపాటు పోషించవచ్చు.




**సంక్షేమం**

సామాన్యులకు నాణ్యమైన వైద్యసేవలు వారి నివాస స్థలానికి అత్యంత దగ్గరలో అందించడమే లక్ష్యంగా కేసీఆర్ సర్కారు బస్తీ దవాఖానలను నిర్వహిస్తున్నది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో దవాఖానలను మరింతగా విస్తరిస్తున్నది. ఏడాదికి 20 చొప్పున కొత్త దవాఖానలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది.

**బస్తీలో పెద్ద వైద్యం**

పథకం ప్రారంభం **2020**

లబ్ధిపొందిన సంఖ్య **2,11,23,408**

## నిఘా పటిష్టం.. శాంతి భద్రతలు పరిపుష్టం

### 2014కు ముందు తెలంగాణలో

- పోలీసుల సంఖ్య **51,697**
- పోలీసు వాహనాల సంఖ్య **5,703**
- **2** కమిషనరేట్ల సంఖ్య (హైదరాబాద్, సైబరాబాద్)
- 2012 నుంచి 2013 నాటికి క్రైమ్‌రేట్ పెరుగుదల **16%**
- 2012-13లో హోంశాఖకు కేటాయించిన బడ్జెట్ **3,739 కోట్లు**
- 2004-2014 వరకు పోలీసు శాఖకు కేటాయింపులు **30,349 కోట్లు**
- 2013 వరకూ హోంగార్డుకు వేతనం- రోజుకు **రూ.200**
- రాష్ట్రంలో సీసీ కెమెరాల సంఖ్య: **లక్ష**

### దేశం, ఇతర రాష్ట్రాల్లో...

- 2021 నాటికి దేశంలో నమోదైన క్రైమ్ రేట్ **445.9%**
- అత్యధిక నేరాల రేటు ఉన్న రాష్ట్రాలు **5** (ఉత్తరప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్)
- **112.7%** ఉత్తరప్రదేశ్‌లో క్రైమ్‌రేట్
- **84.5%** మధ్యప్రదేశ్‌లో క్రైమ్‌రేట్
- **83.6%** రాజస్థాన్‌లో క్రైమ్‌రేట్
- **50.2%** కర్ణాటకలో క్రైమ్‌రేట్




**20,115** పోలీసు వాహనాల సంఖ్య (2023 నాటికి)

### 2014 తర్వాత తెలంగాణలో

- **86,829** ఉమ్మడి రాష్ట్రంలో పోలీసుల సంఖ్య
- **17,516** కొత్తగా రిక్రూట్‌మెంట్ దశలో ఉన్న సంఖ్య
- 2014-2023 వరకు క్రైమ్‌రేట్ **46%** తగ్గుదల
- 2023 -2024లో హోంశాఖకు కేటాయించిన బడ్జెట్ **9,598.98 కోట్లు**
- గడిచిన ఆరు నెలల్లో నమోదైన క్రైమ్‌రేట్ **4.80%**
- పదేండ్లలో పోలీసు శాఖ పటిష్టానికి చేసిన ఖర్చు **59,200.41 కోట్లు**
- **18,491** మంది హోంగార్డులకు ఒక్కొక్కరి వేతనం **27,000**
- ట్రాఫిక్ హోంగార్డులకు వేతనం -**రూ.30,000**
- **9** పోలీస్ కమిషనరేట్ల సంఖ్య (దేశంలోనే రెండోస్థానం)
- రాష్ట్రంలో సీసీ కెమెరాల సంఖ్య **10.13 లక్షలు**
- దేశంలోనే అత్యధికంగా సీసీ కెమెరాలున్న రాష్ట్రం తెలంగాణ

## సిద్ధులగుట్ట టు యాదగిరిగుట్ట

ఇటీవల ఆర్మూర్ నవసిద్ధుల గుట్ట, యాదగిరిగుట్ట నర్సింహస్వామి దర్శనానికి బస్సులో పోయిన మాందాపూర్ గ్రామస్తులు తెలంగాణ అభివృద్ధి, ఉమ్మడి పాలనలో కష్టాల గురించి చేసుకున్న సంభాషణ వారి మాటల్లోనే...




# సారుంటేనే.. సౌలత్‌లు

**మా** సర్పంచ్ సులోచనమ్మ, ఆమె భర్త రంపె గంగాధర్ కాక కొబ్బరి కాయ కొట్టంగనె బస్సు బయల్దేరింది. అంతకుముందు మావూరి బీఆర్ఎస్ అధ్యక్షుడు, పెదకాపు సత్యనారాయణ కాక 'జై తెలంగాణ, జై కేసీఆర్, జీవనన్న నాయకత్వం వర్ధిల్లాలి' అని నినాదాలియ్యంగనె జై కొట్టుకుంట అందరూ బస్సెక్కిండ్రు.

**గౌరవ్వ:** నన్ను మా బాపు కూడా ఏ యాత్రలకు తిప్పకపాయే. జీవన్‌రెడ్డి పుణ్యాన యాదగిరిగుట్ట సూడవడ్తి.. అయ్యా యాదగిరి నర్సిమ్మసామీ.. మల్లా కేసీఆరే రానీ.. నాకు ఇల్లు లేదు. మల్లా ఆయన్నే గెలిత్తే గృహలక్ష్మి పైసలతో నా పిల్లలకింత గూడు నిలవడ్తది. (అందరికీ వినిపించేలా మొక్కుతుంటే...)

**గంగయ్య:** గంతేనా గౌరమ్మా?!.. నీ పొలంకు ఫిరీ కరెంటు, లాగోడికి పైసలు (రైతుబంధు), మీ అయ్యకు ఇకలాంగుల పింఛను, మీ అవ్వకు ముసలోల్ల పింఛను, నీకు బీడీల పింఛను.. గివన్నీ ఎటువోయినయి? అవన్నీ శెప్పవేం పిల్లా?!

**గౌరవ్వ:** అందుకే కద ముసలోడా.. మల్లా కేసీఆరే రావాలని మొక్కుతున్నా!

**గంగయ్య తాత:** ఆ గదే అంటున్నా మరి ఎందుకంటే, అప్పట్ల మేము టీడీపీల తిరిగినప్పుడు గీ భూముల్ల మక్కశేన్లు ఉంటుండె. నీల్లు లేక గీ షేన్లన్నీ ఎండిపోతుండె. గంతటి కరువున్నదా ఇప్పుడు?!

(గంగయ్య చెప్తుంటే మా అమ్మ, గంగమణి చిన్నవ్వ కండ్లు మల్లోసారి చెమర్చినయ్. అంతకుముందు అంకాపూర్ తోటలను చూసి మా ఇద్దరు అవ్వల కండ్ల ముంగట గతం గిర్రున తిరిగింది. మా బాపు, చినబాపు ఆర్మూరు పట్టెకు వలస పోయిన రోజులు తల్సుకొని వాల్ల కండ్లల్ల నీల్లు సుడులు తిరిగినయ్)

**శిన్నర్సయ్య:** బోర్లకాడ కరెంటు డబ్బాలు పీక్కపోయిందిగూడా గప్పుడేగాదా

**లింగరెడ్డి:** కాంగ్రెసోల్లదేమన్న కమ్మటి పాలన్నా? దొంగ కరెంటు, ముష్టి డెబ్బై రూపాయల పింఛిని (అని అంతెత్తు లేసిండు)

**శీను:** ఇప్పుడు మల్లా అస్తుండ్రుగదనే. గ్యారెంటీలు, వారంటీలు అని చెప్పుకుంటా. అప్పట్ల పారిందే పారుడు, ఆ కొనాకు గనుమ అందనే అందది.. పాములుంటయో తెలది, తేళ్లుంటయో తెలది.. శీకట్లవాయ్ కరెంటు డబ్బాల శేతువెడ్తే ఏ వైరు తలిగి పాణంబోతదో తెలది.. కొత్తగ లగ్గమైనోడి పానమంత ఇంటికాడ, పండుడేమో బోర్లకాడ.

(కాంగ్రెస్ హయాంల కరెంటు కష్టాల గురించి శీను మామ చెప్పుకుంటూ పొట్టుపొట్టు తిట్టుడువెడుతుంటే బస్సులున్నోల్లందరి కడుపులు చెక్కలైనయ్)

**పల్లక్క:** ఔ మరి ఇప్పుడున్న సౌలత్‌లు ముందు యాడుండె? ఊల్లె ఒలన్న సస్తే అలుగుల్ల మోకాల్లమంటి నీల్లల్లకెల్లి దాటుకుంటా కట్టకొమ్ముకు పెద్దుంటిమి. ఇప్పుడు మంచిగ శ్మశానవాటిక కట్టిచ్చిండ్రు.

**సత్యనారాయణ:** అంతేకాదు, తెలంగాణ అచ్చినంకనే మన ఊరి పంచాదాఫీసు మనది మనకైంది. ఇంటింటికి నల్లా నీల్లస్తున్నయ్. సీసీరోడ్లు పోసుకున్నం. లక్ష్మపురం మీదికెల్లి బ్యాంకుకు పోదానికి మంచిగ డాంబర్ (బీటీ) రోడ్డుపడ్డది. కొత్తగ ఇస్కూల్ల పిల్లలకు టిఫిన్ (సీఎం బ్రేక్‌ఫాస్ట్) కూడా ఫ్రీగా పెడ్తున్నరు. గింత మంచి సౌలత్‌లు ఇంతకు ముందెప్పుడైనా సూశినమా?

(కేసీఆర్ సర్కారు చేసిన డెవలప్‌మెంటునంతా సదువుతుండంగనే...)

**మహేశ్:** అందుకే అందరం ఒకటే మాట మీద ఉండాలే.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉంటేనే మనకు మేలు.. మల్లా జీవన్‌రెడ్డే రావాలని మొక్కుకొర్రి, దిగుర్రిగ అచ్చింది యాద్గిరిగుట్ట

*(అందరూ బస్సు దిగి యాదాద్రి నర్సన్న ఆలయం దిక్కు నడిశిండ్రు).*

... ఆరుట్ల నరేశ్

## సోషల్ యాంగిల్

### గోల్‌మాల్ గుజరాత్





గుజరాత్ గురించి తెలుసుకోవాల్సింది ఏమంటే..
27 ఏండ్లు బీజేపీ అధికారంలో ఉన్న ఆ రాష్ట్రంలో
24గంటల కరెంటు లేదు..
ఇంటింటికీ తాగునీరు లేదు
అభివృద్ధి మనంత లేనేలేదు.
ఎప్పుడూ మతోన్మాద గొడవలు
అయినా తమ రాష్ట్రం నుంచి మోదీకి జైకొట్టి
ప్రధానిగా గెలిపించుకున్నరు.

సాగునీరు, తాగునీరు, సంక్షేమం, అభివృద్ధిలో
దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణపై
నిత్యం విషం చిమ్ముతున్న ద్రోహులూ
ఇంటి పార్టీకి అండగా ఎలా ఉండాలో
గుజరాతోళ్లను చూసి నేర్చుకోవాలి..
ఇలాగే బానిసత్వం చేస్తూ ఉంటే ఇక్కడి
సంపదను గుజరాత్‌కు తరలించుకుపోతరు..

-రంజిత్‌రెడ్డి కర్ర

### పూలదారిలో కారు



గల్లీకో నాయకుడు.. ఢిల్లీలో పాలకులు
సీల్డ్ కవర్ పత్రాలు.. ఎన్నికల సిత్రాలు

భయంతోటి బలగాలు.. బడానేత మీటింగులు
ఒక్క అంకె ముచ్చటకే.. పువ్వు గుర్తు రంకెలు

భగీరథ నీళ్లొచ్చే.. కాళేశ్వరం ఉప్పొంగే
పథకాల ప్రజాబంధు..
సారు 'కారు' సదా ముందు.

-ఎం వంశీధర్



## ఐటీలో మనమే టాప్

**ఐ**టీ రంగంలో హైదరాబాద్ దూకుడుమీదున్నది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తమ కంపెనీలు ఇక్కడ నెలకొల్పేందుకు ఆసక్తిని చూపిస్తున్నాయి. సిలికాన్ వ్యాలీ బెంగళూరుతో పోలిస్తే ఇక్కడ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ సరళీకృత విధానాలు, ఆఫీస్ స్పేస్, అనుకూల వాతావరణం, మానవవనరుల లభ్యత, శాంతిభద్రతలు, రవాణా సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్న యాజమాన్యాలు దేశంలోనే మొదటి ప్రాధాన్యతగా హైదరాబాద్ నగరాన్ని ఎంచుకుంటున్నాయి. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఐటీ పెట్టుబడులను ఆకర్షిస్తుండడంతో యువతకు పెద్ద ఎత్తున సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ప్రకృతి రమణీయతతో సిరులు కురిపించే పాడిపంటలకు నెలవు పాలకుర్తి. ఘనమైన త్రిలింగ, తెలంగాణ సారస్వత, చారిత్రక వారసత్వానికి ప్రతీక. సీఎం కేసీఆర్ ప్రగతి పాలనలో జనం మెచ్చిన నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు సారథ్యంలో ప్రగతికి కేరాఫ్‌గా పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందుతున్నది. 1994లో అప్పటి వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రబెల్లి దయాకర్ రావు 2009లో పాలకుర్తిలో పాగావేశారు. వరుసగా మూడుసార్లు విజయం సాధించారు. సంక్షేమంతోపాటు ప్రగతి ఫలాలనూ ప్రజలకు చేరువ చేస్తూ.. నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ కంచుకోటగా మలిచారు.

▪ ఏరియల్ వ్యూ: పాలకుర్తి



## కాకతీయ కళకళ.. దేవాదుల మిలమిల


### లక్షలాది ఎకరాలు సస్యశ్యామలం.. దాయన్నకు జనం జేజేలు



సీఎం కేసీఆర్ ఆశీస్సులతో పాలకుర్తి - బమ్మెర - వల్మిడి కారిడార్‌గా అభివృద్ధి చేస్తున్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లకు రూ. 163 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు 33 వేల 29 ఎకరాలు మాత్రమే సాగు నీటి సౌకర్యం ఉండగా, నేడు 77 వేల 67 ఎకరాలకు పెంచారు. మిషన్ కాకతీయ ద్వారా 331 చెరువులను అభివృద్ధి చేశారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ పరిధిలో 79.59 కిలోమీటర్ల మేర కాల్వల నిర్మాణం చేపట్టారు. యశ్వంతాపూర్, దేవరుప్పుల, పాలేరు, ఆకేరు వాగులపై 27 చెక్ డ్యాంలను నిర్మించారు. దీంతో భూగర్భజలాలు పెరిగాయి.

రైతుబీమా పథకంలో 1,027 కుటుంబాలకు సాయం అందించారు. ఆరు మండలాల్లో రైతు వేదికలను నిర్మించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద 9,162 మంది లబ్ధిదారులకు రూ.87.1 కోట్లు అందజేశారు. మిషన్ భగీరథ ద్వారా నియోజకవర్గంలోని 442 ఆవాసాలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. 104 ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించారు. 4,561 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి పేదలకు అందజేశారు. 56 నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించారు. 10 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నారు. వేలాది మందికి కేసీఆర్ కిట్లు అందజేశారు. ఆరు మండలాల్లోని 177 గ్రామాల్లో వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. తొర్రూరు, దేవరుప్పుల, కొడకండ్ల శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. సెంట్రల్ లైటింగ్, డివైడర్ల విస్తరణ, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, మార్కెట్లు, పార్కులు ఏర్పాటు చేశారు.

352.41 కి.మీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేశారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మెటల్‌రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. 181 కి.మీ డబుల్ రోడ్లు, రూ.143 కోట్ల 24 లక్షలతో బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేశారు. తండాలకు రూ.8 కోట్ల 65 లక్షల వ్యయంతో బీటీ రోడ్లు నిర్మించారు.



## షహర్ కీ బాత్

### గ్లోబల్ సిటీకి తీసిపోదు




ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అనంతరం హైదరాబాద్ నగరం అనూహ్య రీతిలో అభివృద్ధి చెందుతున్నది. గ్లోబల్ సిటీకి ఏమాత్రం తీసిపోని విధంగా మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. మెరుగైన రోడ్లు, ప్రణాళికాబద్ధమైన భవన నిర్మాణ రంగం, మెరుగైన రవాణా సదుపాయాలతోపాటు, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఎన్నో అవకాశాలు ఏర్పడ్డాయి. ఐటీ రంగంలో పెట్టుబడులకు దీటుగా అంతర్జాతీయ స్థాయి కంపెనీల రాకతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రెండింతలు పెరిగాయి. కేవలం ఐటీ రంగానికే తెలంగాణ పురోభివృద్ధి పరిమితం కాకుండా అన్ని రంగాలకు విస్తరించింది. ఇలా అన్ని వ్యవస్థలు బలోపేతం కావడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎదురయ్యే సంక్షోభాల ప్రభావాన్ని సమర్థవంతంగా తట్టుకోగలదు. దీంతో సుస్థిరమైన ఉపాధి, అవకాశాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా రాష్ట్రం ఆర్థిక పురోగతి దిశగా దూసుకుపోవడానికి ఆస్కారం ఉంటుంది.

- ప్రతిభ పులిజాల, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ స్కూల్, ఫౌండర్

# ఫోన్ కొట్టు.. ఓటు పట్టు!

### నేరుగా ఓటర్లకు ఫోన్ కాల్.. పథకాలు వివరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థన.. కాల్ సెంటర్లతో ఒప్పందం

*స్మార్ట్‌ఫోన్ల యుగంలో ప్రచారం కొత్త పుంతలు తొక్కుతున్నది. ఇంటింటి ప్రచారం కాస్త స్మార్ట్‌గా మారింది. నామినేషన్లకు సమయం ముంచుకొస్తుండటంతో తక్కువ సమయంలోనే ఎక్కువ మంది ఓటర్లను చేరుకునేలా వివిధ పార్టీల అభ్యర్థులు ప్లాన్ చేస్తున్నారు. నేరుగా ఓటర్లకు ఫోన్లు చేయిస్తున్నారు. అందుకోసం కాల్‌సెంటర్లను నియమించుకుంటున్నారు. ఓటర్లకు ఫోన్లు చేసి అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు పలు కాల్ సెంటర్లు రంగంలోకి దిగాయి.*




**కా**ల్‌సెంటర్ల నిర్వాహకులు అధికార, ప్రతిపక్షాల అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఓటర్లకు ఫోన్లు చేసి 'మీ నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా ఉన్నది? స్థానిక సమస్యలను పరిష్కరించడంలో ఎవరు ముందుంటారు? ప్రస్తుత ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉన్నది? ఈసారి మీ ఓటు ఎవరికి?' అంటూ అడుగుతున్నారు. పనిలోపనిగా సంక్షేమ పథకాలను వివరించి సదరు అభ్యర్థికే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఈ మేరకు అభ్యర్థులు, కాల్‌సెంటర్ల మధ్య ఒప్పందాలు కూడా జరుగుతున్నాయి. పలు ఏజెన్సీలు ఆకర్షణీయమైన ఆఫర్లను కూడా ప్రకటిస్తున్నాయి.

**యువతకు ఉపాధి మార్గం**

సమగ్ర సమాచారంతో రంగంలోకి దిగుతున్న కాల్‌సెంటర్లు అభ్యర్థి వివరాలు, పార్టీ అమలు చేసే పథకాలను ఓటర్లకు వివరిస్తున్నాయి. అందుకోసం నియోజకవర్గ పరిధిలో క్యాంపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ సర్వీసుల వల్ల స్థానికులకు ఉపాధి లభిస్తున్నది. హిందీ, ఇంగ్లిష్, తెలుగు మాట్లాడే మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులను తాత్కాలిక ప్రాతిపదికన ఏజెన్సీలు నియమించుకుంటున్నాయి. ఇంగ్లిష్ వచ్చిన వారికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. రోజు లెక్కన, కాల్స్ వారీగా జీతభత్యాలను అందిస్తున్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని తార్నాకలో ఉన్న ఓ కాల్‌సెంటర్ నిర్వాహకులు ఓయూ విద్యార్థులను పార్ట్ టైం విధానంలో నియమించుకున్నారు. ఒక్కో కాల్‌సెంటర్ అవసరాన్ని బట్టి 50-100 మందిని నియమించుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. నామినేషన్ల పర్వం మొదలయ్యే నాటికి కాల్‌సెంటర్ల ప్రచార పర్వం జోరందుకునే అవకాశం ఉన్నది.

... కడార్ల కిరణ్